**చావు తప్పదని అందరికీ తెలుసు. అయితే అదెన్ని రకాలుగా జీవితాన్ని 'ఫూల్' చేస్తుందో. చేసే దాకా యెవరికైనా తెలుస్తుందా?**

ఆ రోజు శ్రీమతి దగ్గర నుంచి వచ్చిన ఉత్తరం చూశాక పనిమీద మనస్సు నిలువలేదు. సాయంత్రం వరకూ ముళ్ళమీద కూర్చున్నట్టు గడిపి-యింకా ఓ అరగంట టైము వుండగానే ఆఫీసులోంచి బయటపడ్డాను. తల దిమ్ముగా వుండడంతో టీ త్రాగాలనిపించింది.

దగ్గర్లోవున్న బొంబే ఆనంద్ భవన్‌లో ప్రవేశించి, అయిదు నిమిషాలు వెయిట్ చేశాక దొరికిన సీట్లో కూర్చొని, టీ తీసుకురమ్మని సప్లయిర్‌కు చెప్పాను. కొద్ది క్షణాల్లో పొగలు గ్రక్కుతున్న టీ తెచ్చి నా ముందుంచాడతను.

టీ త్రాగ్గానే తల దిమ్ము తగ్గినట్టనిపించింది. సిగరెట్టు వెలిగించి శ్రీమతి రాసిన ఉత్తరాన్ని బయటకు తీశాను. ఆఫీసులో ఒకసారి చదివిందే అయినా మళ్ళా కవరు మడతలు విప్పాను.

ప్రియమైన శ్రీవారికి నమస్కారములు

ఉద్యోగంలో చేరిన వారంరోజుల్లో యిల్లు చూసి తీసుకువెడతానని చెప్పి అప్పుడే ఆరువారాలైంది. యిల్లు దొరకలేదన్న ఉత్తరాలే తప్ప యింతవరకూ యిల్లు చూసి మీరొచ్చిందిలేదు. కళ్ళు కాయలు కాసేలా మీకోసం ఎదురు చూడటంతోనే రోజులుగడిచిపోతున్నాయి. మీరక్కడ యిల్లుచూడటమూ, ఆ యింట్లో మనిద్దరం కాపురం చేయడమూ ఈ జన్మకు జరగనట్టే కనిపిస్తుంది. పెళ్ళి చేసుకున్న విషయం మర్చిపోయినట్లున్నారు....నిజంగానే అటువంటిది జరిగితే ఒకటి రెండు రోజులు చూసి అర్జంటుగా నేనే బయలుదేరి తమ ఆఫీసుకు వచ్చి గతాన్ని గుర్తు చేయగలను. అంతటి అవసరం లేకుండా రెండు రోజుల్లో యిల్లు చూసుకొని మీరే వస్తారని విశ్వసిస్తున్నాను.


మొన్న మీ వదిన యిక్కడకువచ్చారు మీ అమ్మగారు 'ఆస్మా' జబ్బుతో బాధపడుతున్నారట. మందులు వాడుతున్నామని చెప్పి ఆవిడను చూడవలసిన బాధ్యత మనకీ వున్నదని జ్ఞాపకం చేశారు. నిజం కూడా అంతే....ఇంతకాలం మీ రామెను ఎలాగూ చూడలేకపోయారు. ఏదో కాస్త సంపాదిస్తున్నారు కనుక- యిప్పటికైనా ఆవిడ మంచి చెడ్డలు చూడటం మన విధి. యిల్లు దొరకలేదన్న మీ సమాధానం నాకు అవసరం లేదు.

—మీ నీరజ.

ఉత్తరం పూర్తి కాగానే గాఢంగా నిట్టూర్చాను. కావాలని కాలయాపన చేస్తున్నట్టు నీరజ నామీద అపోహపడుతుంది. ఇల్లు కోసం యిక్కడ ఎంత అవస్థపడుతున్నానో ప్రతి ఉత్తరంలో రాస్తున్నా నమ్మడం లేదంటే నా బాధ యింకెవరికి చెప్పుకోవాలో అర్థం కాకుండా వుంది.

ఉద్యోగంలో చేరగానే యిల్లు కావాలన్న నా ముఖ్య సమస్యను తోటి సహోద్యోగుల ముందుంచి- వాళ్ళ పెదవి విరుపులు చిరునవ్వుతో రోజూ భరిస్తూనే వున్నాను.

ఊరుగాని వూళ్ళో ఉద్యోగానికివచ్చాడు




ఏదో నాల్రోజులేకదా అని వుండటానికి చోటిచ్చిన దూరపుచుట్టం వీడెప్పుడొదిలి పోతాడా అని విసుక్కుంటున్నా వినపడనట్టు వూరుకుంటున్నాను.

నా మటుకు నేనీ కాకినాడలో తిరగని వీధి లేదు. అడగని యిల్లు లేదు. అసలు కాకినాడలో యిల్లు కోసం యింత శ్రమ పడాల్సివస్తుందని కలనైనా అనుకోలేదు.

పట్టణంలో ఏ పేట ఎక్కడుందో, ఎవరిల్లు ఏ మూలనుందో - ముచ్చటైన మేడలెక్కడున్నాయో, మురికి కూపాలెక్కడున్నాయో క్షుణ్ణంగా తెలిసిపోయిందే తప్ప యిల్లు మాత్రం దొరకలేదు.


అసలు నాకు యిల్లంటూ దొరుకుతుందా? లేక నీరజ రాసినట్టు ఈ ఉద్యోగం ధర్మమా అని తానక్కడా - నేనిక్కడేనా? ఏమిటో నీరజ సరసన లేని జీవితం నిస్సారంగా అనిపిస్తుంది. తెల్లని వెన్నెల రాత్రులూ, చల్లటి పిల్లగాలులూ, మత్తెక్కించే మల్లెల వాసనా జ్ఞప్తికి వచ్చినప్పుడల్లా ఈ ఉద్యోగంమీద విరక్తి పుట్టుకొచ్చేస్తుంది.

పవిత్ర భరత భూమిలో ఉద్యోగాల్లేక లక్షోప లక్షలమంది వుసూరుమని ఏడుస్తుంటే వున్న వుద్యోగం చేసుకునేందుకు బాధ వచ్చిపడిందేమి టనుకుంటున్నారా? బ్రతుకు తెరువనేది లేకపోతే వెన్నెలా, చల్లగాలీ వేడెక్కుతాయని ఆ వేడికి మల్లెపూలు వాడిపోతాయని నాకు తెలియక్కాదు.

మనిషి నైజం అంతే.... ఒకటి వుంటే యింకోటి కావాలి!

అలాగని పదిమంది నోళ్ళు కొట్టి పదివేలు సంపాదించుకోవాలని కాని, పట్టుదల, పౌరుషం చంపేసుకొని— చీమూ నెత్తురూ పిండేసుకొని పార్టీలు ఫిరాయించే రాజకీయ నాయకుణ్ణి అవ్వాలని కాని నేను కోరుకోవడంలేదు- శ్రీమతితో కలిసి కాపురం చేసుకునేందుకు ఓ యిల్లంటూ కావాలనేదే నా కోరిక?

నిప్పు కాలుతుందని వ్రేళ్ళ మధ్యనున్న సిగరెట్టు నిరూపించింది. టేబిలు మీదున్న బిల్లు తీసుకొని, డబ్బులు




# అద్దెయిల్లు

చోడిశెట్టి నాగశ్రీనివాసరావు

[illegible]ల్లించి బయటకు వచ్చాను.

భానుగుడి సెంటరు జనంతో కళకళలాడుతూంది. సమీపంలో రెండు థియేటర్లు ఉండటం వల్ల ఆ సెంటరు కొంత ప్రత్యేకత వచ్చిపడింది. దానికి తోడు అడుగడుగునా అవతరించిన అనేక రకాల షాపులు ఆ సెంటరు అందాన్ని మరింత ఇనుమడింపచేస్తున్నాయి.

పద్మప్రియ థియేటరు ముందు క్యూలో నించొన్న జనం సినిమా ఎప్పుడు చూసేస్తామా అని మహా తొందరపడిపోతున్నారు.

మడికట్టుకునే వాళ్ళు - ముట్టుకో కూడనోళ్ళు అన్న భేదంలేక అందరినీ సమానంగా మోసుకుపోయే బస్సుల కోసం

సినీ తారలు

శ్రీదేవి, సుజాత, జయసుధ, జయప్రదం ఫొటోల సెట్టు 5 రూ. ఏయన్నార్, ఎన్టీఆర్, శోభన్‌బాబు, కృష్ణ, కృష్ణంరాజుల ఫోటోల సెట్టు 6 రూ. తెలుగు, హిందీ తారల అడ్రసులు (ఫోను నంబర్లతో సహా) గల పుస్తకం 2 రూ. ఎం.ఓ. చేయండి!

SUVARNA

వై. కె. మూర్తి,
దాసరివారివీధి, విజయవాడ-2

S 76369.



సమర్థవంతమైన ర్యాలీఫ్యాన్
సర్వీసు సిబ్బంది దీనివెనకఉంది.
మీకు ఎప్పుడైనా అవసరం అయితే!

ర్యాలీఫాన్
కాలానికి నిలుస్తుంది—ఎంతో అందంగా
nirmala

ఆడియోవిజన్
విజయవాడ-2

డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్



వివాహము వాయిదా వేయ నవసరంలేదు. హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్ర స్ఖలనములకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స కలదు.

రావూస్ క్లినిక్,
టి. బి రోడ్, తెనాలి, ఫోన్ : 700. 1010

బస్సు స్టాపులో ఎదురుచూస్తున్నారు బస్సెక్కవలసిన వాళ్ళు.

కిళ్ళీకొట్టు కనకారావు అంకెల చార్టు ముందేసుకూర్చొని, అంటురోగంలా ప్రబలిపోయిన బ్రాకెట్టు థీరీ గురించి- ఆ రోజు వచ్చే అంకె గురించీ తనచుట్టూ వున్నవాళ్ళకు ఉపదేశిస్తున్నాడు.

పాపారావు పళ్ళకొట్టుముందు ఎత్తుగా, అందంగా పేర్చిన కొత్తపల్లి కొబ్బరి మామిడి పళ్ళు వచ్చే- పోయే వాళ్ళ దృష్టిని కొన్నిక్షణాలు తమవైపు తిప్పుకుంటున్నాయి.

నిద్రగన్నేరు చెట్టు క్రింద చిరిగిపోయిన గొడుగు నీడలో- వలిగిపోయిన చెప్పులకు నిగనిగలు సృష్టిస్తున్నాడు నాంచారయ్య.

శాను గుడిలోంచి కొంతమంది భక్తులు దేవుడి ముందు తమ భక్తిని ప్రదర్శించి, కోరికల్ని తెలియపర్చుకొని బయటకు వస్తున్నారు. మనస్సులో వున్నవి మనవి చేసుకునేందుకు మరి కొందరు లోపలకు వెళుతున్నారు.

నాకూ కూడా ఆ క్షణంలో దేవుడిమీద భక్తి యేర్పడిపోయింది. ప్రక్కనున్న పాన్ షాపులో కొబ్బరికాయకొని గుడిలో కెళ్ళాను. "ఈవేళయినా నాకు యిల్లు దొరికేలా చెయ్యి స్వామీ!" అని భగవంతుణ్ణి వేడుకొని బయటకు వచ్చి సైకిలు ఎక్కాను.

ఫలానా చోటుకు పోవాలనే నియమం ఏమీలేదు. అప్పటికెన్నోసార్లు ఆ చుట్టు ప్రక్కల ప్రాంతాలన్నీ గాలించి వదిలేశాను. కేవలం దేవుడి మీదే భారం వేసి కూర్చుంటే పన్లు జరిగిపోవు - ప్రయత్న లోపం వుండకూడదన్న వుద్దేశ్యంతో సుదూరంలోవున్న సూర్యారావుపేట వైపు సైకిలు పోనిచ్చాను.

కళ్ళు రోడ్డు కిరువైపులావున్న యిళ్ళను గమనిస్తూనే వున్నాయి. మనస్సు మాత్రం శ్రీమతి వుత్తరాన్నే తల్చుకుంటోంది. — రెండు రోజుల్లో యిల్లు చూసుకొని నేను వెళ్ళకపోతే శ్రీమతి అన్నంత పనీ చేసేస్తుందేమో? అసలే పిచ్చికోపం మనిషి! అనుకున్నది అనుకున్నట్టూ జరక్కపోతే ఆవిడకు నిద్రపట్టదు. అమ్మగురించి శ్రద్ధ తీసుకొని రాసింది. ఎంత కోపం వుందో అంత మంచి మనస్సూ వుంది. పాపం అమ్మకెలావుందో? చూసి చాన్నాళ్లు అయింది. ఈవేళా- రేపు అనుకుంటూ యిన్నిరోజులు గడపకుండా- యీ మధ్య కాలంలో ఒక్కసారి వెళ్ళివుంటే ఎవరికీ బాధలేకుండా వుండేది.

పుట్టి పెరిగి పాతిక సంవత్సరాలు నా నెత్తికొచ్చాయేగాని, నా ప్రయోజకత్వంతో పస్తైడన్నం ఆమెకు ప్రేమతో పెట్టిన రోజు లేదింతవరకూ. తొందరగా యిల్లు దొరికితే శ్రీమతితోబాటు అమ్మనూ తీసుకువచ్చి, కొంతకాలం యిక్కడే అట్టిపెట్టుకొని కన్నరుణం తీర్చుకోవాలి.

నా వూహలతోపాటు సైకిలు ముందుకు పరుగు పెడుతోంది. సూర్యారావుపేట, రామారావుపేట, గాంధీనగర్, ప్రతాప్ నగర్ యివన్నీ చుట్టబెట్టేశాను. ఏ వీధిలో అడిగినా యిల్లు ఖాళీ లేదన్న మామూలు పాఠమే వినిపిస్తూంది.

సూర్యుడు తన పని ముగించుకుంటున్నాడు. తన ముగింపులోని అందాల్ని పడమటి ఆకాశంపైకి విరజిమ్ముతున్నాడు

మా పనీ ముగిసిందన్నట్టుగా సైకిలు పెడల్స్‌ను కాళ్ళు భారంగా త్రిప్పుతున్నాయి. లేని శక్తి తెచ్చుకొని ద్వారకానగర్‌లో నాలుగు వీధులూ తిరిగాను. నా ప్రయత్నం ఫలించలేదు. ఆ రోజు కూడా యిల్లు దొరకదన్న నిరాశ నన్నావరించింది, విసుగూ, కోపం పెనవేసుకుంటున్నాయి. ఆఖరుసారిగా గానుగవారి వీధిలోకి సైకిలు త్రిప్పాను.

ఆ వీధి మొగదలనున్న ఓ యింటి కటకటాల్లోంచి పదహారేళ్ళ యౌవనపు బొమ్మ అందంగా వెక్కిరిస్తోంది - నన్ను చూసేనా? కాదని ఆ యింటి కెదురుగా వున్న యింట్లోకి చూడగానే అర్థమైపోయింది. ఈ ప్రపంచంతో సంబంధం లేనట్టే తన ముందున్న లావుపాటి పుస్తకంలోకి తల దూర్చేశాడో బుద్ధిమంతుడు. ప్రేమ వేగం పెరిగిపోతున్నట్టనిపించింది. ఒక్క క్షణం సైకిలాపి "ఈ వీధిలో ఇల్లేదైనా ఖాళీవుందా?" అని ఆమెనడిగాను.

"యిల్లా! ఆ చివరికెళ్ళండి. అక్కడ పోష్టాఫీసు కెదురుగా వున్న యింట్లో ఓ పోర్షను ఖాళీగావుండాలి." లోపల తిట్టుకుంటుందేమో తెలవదుగాని సౌమ్యంగానే సమాధానం చెప్పిందామె.

కృతజ్ఞతలు తెలుపుకొని ఆత్రుతగా వీధి చివరకు వెళ్ళాను. ఆమె చెప్పింది నిజమే— అక్కడో యింటిముందు 'టులెట్' బోర్డు నాకు స్వాగతం పలికింది. ఆ అమ్మాయి ప్రేమ ఫలించాలని మనసారా ఆశీర్వదించాను. ఆ యింటిముందు సైకిల్ స్టాండువేసి, యినుపగేటు తెరుచుకొని లోపలకు వెళ్ళాను. వెళ్ళిన మరుక్షణమే వెనుకడుగు వేశాను.

ఆల్సేషియన్ డాగ్ అరుపులు వినిపించ లేదుకాని అంతకన్నా భయంకరమైవ

గొంతు లోపల్నుంచి వినిపించింది. "ఎవరదీ?" అన్న ప్రశ్నతోబాటు బరువైన శరీరం కదుల్తున్న చిన్న కొండలావచ్చి నా ముందు నిల్చింది.

ఆవిడా యింటి అధికారిణి అయి వుండాలి!

ఆమెకు అరవై ఏళ్ళు పైబడి వుండొచ్చు!!

అంత వయస్సులోనూ అరచేత్తో అవలీలగా అరడజను మందిని కొట్టి ఆవలకు విసిరేసేలా కనిపించింది. తొట్రుపాటు తగ్గించుకొని వచ్చిన పని చెప్పాను.

"నువ్విల్లు కోసమే వచ్చావనుకో నాయనా.... మనుష్యుల్ని పిలవకుండా యింట్లో జొరబడ్డం తప్పుకాదూ?" అందావిడ నేనేదో పెద్దనేరం చేసినట్టు. శరీరానికి తగ్గ గొంతే అనిపించింది. ఏం చెప్పాలో కాస్సేపు తోచలేదు.

"చదువుకుంటున్నావా నాయనా - లేక ఏమైనా సంపాదిస్తూ సంసారం చేసుకుంటున్నావా?" అందావిడ మళ్ళీ. "సంపాదన ఈ మధ్యనే మొదలైందనీ, యిల్లు దొరికితే సలక్షణంగా సంసారం చేసుకోవాలనుకుంటున్నా" ననీ చెప్పాను.

ఆ తరువాత నే పనిచేస్తున్న ఆఫీసు గురించి, నాకొచ్చే జీతం గురించీ, యింట్లో వుండేవాళ్ళ సంఖ్య గురించీ- యిలా సవాలక్ష ప్రశ్నలేసింది. అన్నిటికీ ఓపిగ్గా సమాధానాలు చెప్పాను. ఆఖర్న యింట్లో వుండేది ముగ్గురం అని తెలుసుకున్నాకనే ఆ యిల్లు చూడ్డానికి అనుమతించిందావిడ.

వీధివైపు కటకటాలతో చిన్నవసారా, పడగ్గది- వంటగదులతో చాలా సింపుల్‌గా వుందా పోర్షను. వెనుక ప్రక్క అందరికీ సంబంధించే బాత్‌రూమ్, లెట్రిన్ వున్నాయి

యింటి చుట్టూ వున్న గ్రౌండు రకరకాల పూలమొక్కలు - కొబ్బరి, మామిడి, నారింజ చెట్లతో నిండివుంది. యిల్లు ఎలా వున్నా పచ్చని చెట్లతో ప్రశాంతంగావున్న అక్కడి వాతావరణం నన్నుఆకట్టుకొంది. "అద్దె ఎంతో చెబుతారా మామ్మగారూ?" అన్నాను నా పరిశీలన పూర్తయ్యాక.

"అద్దె మాటకేంగాని నాయనా! ఈ యిల్లు హిమాలయాలకన్నా చల్లనైందీ — చలువైందీను. పది సంవత్సరాల నుంచి ప్రమోషను రాకుండా వుండిపోయినోళ్ళీ యింట్లోకి వచ్చిన పదిరోజులకే ప్రమోషను వచ్చి వెళ్ళిపోయారు. పిల్లలు పుట్టరనుకున్న వాళ్ళు పది నెలలీ యింట్లో కాపురంచేసి పండంటి పిల్లల్ని కన్నారు. ఈ యిల్లని నేను గొప్పలు చెప్పుకోవడం కాదుగాని- మొన్నటికి మొన్న యిల్లు ఖాళీ

పళ్ల డాక్టరు చెబుతున్నారు
పళ్లు, చిగుళ్ల సక్రమ సంరక్షణకోసం
పళ్లను బ్రష్ చేసుకోవడం ఎంత ముఖ్యమో,
చిగుళ్లను మాలిష్ చేసుకోవడం కూడా అంతే ముఖ్యం
ఫోర్‌హాన్స్ డబుల్ యాక్షన్
టూత్‌బ్రష్ వాడండి
మీ పళ్లను శుభ్రపరచడంతోపాటు చిగుళ్లను మాలిష్
కూడా చేయడానికి ప్రత్యేకంగా రూపొందించబడింది
మృదువైన తెల్లని కుచ్చులు మీ చిగుళ్లను మాలిష్ చేస్తాయి
దృఢమైన నీలిరంగు కుచ్చులు మీ పళ్లను శుభ్రపరుస్తాయి

ఫోర్‌హాన్స్
టూత్ బ్రష్
ఇంటిల్లి పాదికోసం
అడల్ట్ (మీడియం మరియు సాఫ్ట్), జూనియర్, బేబీ.
Regd. T.M: Geoffrey Manners & Co. Ltd.
266 F-122 TEL


సూటింగ్స్ షర్టింగ్స్ ఇతరకములైన
డ్రెస్‌మెటీరియల్స్‌కు మరియు సరికొత్త
డిజైన్లకు దయచేయండి
శ్రీలక్ష్మీ
బొంబే డయింగ్ షోరూం.
యం.జి.రోడ్. కొత్తగూడెం.

ఋణం
వ్యాపారాభివృద్ధి కోసం ఆకర్షణీయమైన షరతులమీద భవనం, వ్యాపారం, షాపులు, భూములు, థియేటర్లు, లిమిటెడ్ కంపెనీలు, పరిశ్రమలు వగైరాలపై రు. 20,000 లేక ఆపైన ఋణం లభించును.
వ్రాయండి లేదా సంప్రదించండి. ఫోన్ : 395126
SUPREME CORPORATION (BANKERS)
F-15, "EVEREST" 7th Floor, Near Famous cine laboratory, Tardeo Road, BOMBAY-400 034.
ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో

ఆంధ్రజ్యోతి

కొత్త డెయిలీ సీరియల్

# ఇటు ఊరా అటు ఏరా

రచన :


పోల్రాప్రగడ రాజ్యలక్ష్మి

తెలుగు దేశపు ప్రకృతి శోభను, గ్రామ వాతావరణాన్ని నేపథ్యంగా తీసుకుని, మానవ ప్రకృతిలోని మంచి చెడులకు అద్దం పట్టిన ఆసక్తికర నవల

ప్రతి రోజూ చదవండి — ఆనందించండి

చేసినాయన ఏ ఆఫీసులో పన్జేసేవాడో నాకు సరిగ్గా గుర్తులేదనుకో ....వాళ్ళొచ్చేటప్పుడు కట్టుబట్టలతో వచ్చారు. యిక వెళ్ళేముందు డబుల్ కాట్ మంచాలు, డన్‌లప్ పిల్లోల దగ్గరనుంచి డ్రస్సింగ్ టేబిల్ వరకూ అమర్చుకొని, ఆవిడ చెవులకు, మెళ్ళోకి నిండినంత బంగారం దిగేసుకొని నాతో గొడవపడి మరీ పోయారు ...."

ఇలా ఆవిడ చెబుతుంటే నేను వింటున్నాను. విన్నదంతా నిజమైవుంటే— ఆఖర్న యిల్లు ఖాళీచేసినతను ఏ హస్తం చాచే డిపార్టుమెంటో, లేక హస్తలాఘవం ముఠాలో మనిషో. అదీ కాకపోతే అదృష్ట వశాత్తు అరుణాచల్ ప్రదేశ్ లాటరీ కొట్టిన వాడో అయి వుంటాడనిపించింది. ఆవిడింకా ఆ యింటి చలవదనాన్ని ఉదాహరణోపేతంగా వివరిస్తూనే వుంది. నేను వినడం మానేశాను. నాక్కావల్సింది యిల్లు. ఆవిడక్కావల్సింది అద్దె. మధ్య ఈ సొదంతా దేనికో నాకు చికాకనిపించింది.




చెప్పవలసింది పూర్తి అయ్యాకనే ఆవిడాగింది నావైపోసారి నిశితంగాచూసి "ఏం నాయనా నువ్వేమీ విన్నట్టు లేదు. నేనేమైనా అతిశయోక్తులు చెబుతున్నాననుకుంటున్నావా?" అంది కాస్త ఆయాసపడుతూ.

"అమ్మమ్మ .... అదేం కాదండి మామ్మగారూ యింటికి అద్దె ఎంతో చెబుతారని ఎదురు చూస్తున్నాను." అన్నాను.

"ఎక్కువ చెబుతాననుకుంటున్నావా నాయనా .... అలాంటిదేం లేదు. పోయిన వాళ్ళు నూటముప్పై యిచ్చేవాళ్ళు. అంతే యిస్తానని నువ్వు అంటావేమో - అలా అంటే ఎలా కుదుర్తుంది చెప్పు? అవతల పన్నులు పెరుగుతున్నాయి. బయట ధరలు మండుతున్నాయి. వెధవదీమధ్య పంచదార పబ్లిక్ మార్కెట్టులో పది రూపాయలు అమ్ముతోంది. పది మంది కాఫీ త్రాగే కుటుంబం వున్నవాళ్ళ కళ్ళు పచ్చబడి పట్టపగలు చుక్కలు కనిపిస్తున్నాయి. అందుకని నువ్వేమీ అనుకోక నూటయాభై యివ్వు ...."

'ముచ్చటగా మూడు గదుల్లేని ఇంటికి మూడు యాభైలా?' ఆవిడకో సాష్టాంగ నమస్కారంచేసి బయటపడాలనిపించింది కాని, శ్రీమతి ఉత్తరం జేబులోనుంచి హెచ్చరిస్తుండటంవల్ల ఆ పని చేయలేక- ఆమె చెప్పిన మొత్తానికో పది రూపాయలైనా తగ్గించమన్నాను.

ఆవిడేం మెత్తబడలేదు. కొద్ది క్షణాలుంటే యింకో ఇల్లు చూసుకో నాయనా అని చెప్పేటట్టు కనబడింది. నాకొచ్చే ఆదాయంలో అంత అద్దె భరించడం కష్టమైనా తప్పదు. కొబ్బరి కాయలోకి నీళ్ళొచ్చినట్టు యిల్లు ఖాళీ అవకుండానే యింట్లో మనుష్యులు మారిపోతున్నారు. కడుతున్న యిళ్ళకు ముందే అడ్వాన్సు యిచ్చేసి కట్టుబడి పూర్తికాకుండానే పెళ్ళి కాపురాలు చేసేస్తున్నారు. యిటువంటి పరిస్థితుల్లో తిరగ్గా తిరగ్గా యిన్ని రోజులకు దొరికిన ఈ యింటి నొదిలేసుకుంటే ఎలా?

రెండు మూడు రోజుల్లో వస్తానుచెప్పి అడ్వాన్సు యిచ్చేశాను.

* * *

అంతా సవ్యంగా జరిగివుంటే మేమా ఇంట్లోకి ప్రవేశించిన తర్వాత జరిగిన కథ చెప్పవలసిన అవసరం లేకపోను. ప్రశాంతతకు మారుపేరుగా వుంటుందనుకున్న ఆ యిల్లు అశాంతికి నిలయమని అతి తొందర్లోనే తెల్సిపోయింది.

యిల్లుగలావిడకు ముగ్గురు కూతుళ్ళు, ఒక్కడే కొడుకు. అందరి పెళ్ళిళ్ళూ అయ్యాక ఆవిడభర్త యిహలోకం నుంచి సెలవు తీసుకున్నాడు. కోడలికి చేతికి పెత్తనం యివ్వలేదు కాబట్టి ఆ యింటి కావిడే మహారాణి. కొడుకు కుళాయి చెరువు ఆఫీసులో పన్జేస్తాడు. అతగాడి భార్య పురిటికని పుట్టింటికెళ్ళింది. పెద్దమ్మాయి పిల్లలు నలుగురు— రెండో అమ్మాయి పిల్లలు ముగ్గురు యిక్కడే వుండి చదువుకుంటున్నారు. (యిల్లు చూడ్డానికి వచ్చినప్పుడు వీళ్ళంతా ఎక్కడున్నారో యిప్పటికీ నాకు తెలియనేలేదు)

మా వాటాలో వుండేది అమ్మతో కలిపి ముగ్గురమైతే - వాళ్ళింట్లో తొమ్మండుగురు




అతడికి 3 నెలలు నిండాక, పాలు మాత్రమే ఇస్తే సరిపోదు

# మీ పాపాయికి కావలసినది ఫారెక్స్

## పాపాయికి ఆదర్శవంతమైన ఘన ఆహారం

**3 నెలల వయస్సు—ఘన ఆహారం ప్రారంభించవలసిన సమయం.**

3 నెలలు నిండాక, పాపాయి పెరిగే అవసరాలకు కేవలం పాలు మాత్రమే సరిపోవు. పాపాయి చురుకుగా, తొందరగా పెరుగుతూంటాడు. అంచేత కేవలం పాలు ఇవ్వగలిగే వాటికన్నా ఎక్కువ కాలరీలు అతడికి కావాలి పాలు తాగడాన్ని తగ్గించి, హెచ్చు కాలరీలు ఇచ్చేదీ, నమలడం అలవాటు చేసేదీ అయిన ఘన ఆహారం పాపాయికి అవసరం.

**3 నెలల వయస్సు—మరింతగా ఐరన్ కావలసిన సమయం.**

"పాపాయికి ఘన ఆహారాలు ప్రారంభించేందుకు 2-4 నెలల మధ్య వయస్సు ఉత్తమమైనది. పాలు మంచి ఆహారమే అయినప్పటికీ, ఐరన్ లేనందువల్ల అది సంపూర్ణ ఆహారం కాదు. అందుకే పాపాయికి ఐరన్ గల ఘన ఆహారాలు కావాలి."

డాక్టర్ సుభాష్ సి. ఆర్య: "ఇన్‌ఫెంట్ అండ్ చైల్డ్ కేర్ ఫర్ ది ఇండియన్ మదర్."

**డాక్టర్లు ఫారెక్స్ ఎందుకు సిఫార్సు చేస్తారు?**

ఘన ఆహారాలు ప్రారంభించడం కోసం, ప్రత్యేకంగా తయారు చేయబడిన ఆహారం ఫారెక్స్. దీనిలో కార్బోహైడ్రేట్లు, కొవ్వు పదార్థాలు, కాల్షియం, ఫాస్ఫరస్, విటమిన్లు ఉన్నాయి. ఫారెక్స్‌లో పుష్కలంగా ఐరన్ కూడా ఉంది. వీటన్నిటివల్లా ఫారెక్స్, పాపాయి సంపూర్ణమైన పెరుగుదలకు ఆదర్శవంతమైన ఘన ఆహారం.

ఉచితం! "పాపాయి మొదటి పీడాది పుస్తకం." కొత్తగా తల్లులైన వారు పిల్లల పట్ల తీసుకోవలసిన శ్రద్ధ గురించి సులభ రీతిలో వివరిస్తుంది. మీ ప్రతి కోసం, 50 పైసల స్టాంపు జతపరుస్తూ ఈ క్రింది చిరునామాకు వ్రాయండి:

పి. ఒ. బాక్స్ నం. 19119, (FAR 16 T)
బొంబాయి 400 025.






డాక్టర్లు సిఫార్సు చేస్తారు ఫారెక్స్

సత్వరమైన, సంపూర్ణమైన పెరుగుదల కోసం పాపాయికి ఆదర్శవంతమైన ఘన ఆహారం

CASGLF-10-308Tel

సభ్యులు. యింటి స్వంతదారులు కనుక వాళ్ళెంత మందివున్నా అద్దెకుండే వాళ్ళకు అడిగే హక్కులేదు. వాళ్ళెంత మంది వున్నారన్న బాధ మాకేం వుండేదికాదు గాని - వచ్చిన చిక్కల్లా ఆవిడ పిల్లలు మూకలు మంచి యింటికి వచ్చాకనే ప్రారంభమయ్యేది.

వాళ్ళింటికి వచ్చింది మొదలు ఒకటే అల్లరి. వూరికినే తిట్టుకునే వాళ్ళు, తిట్టుకొని కొట్టుకునేవాళ్ళు. ఆ తరువాత ఆరు న్నొక్కరాగంతో వీనులవిందు చేసేవారు. మధ్య మధ్య ఉరుముతున్న మేఘంలా యింటి గలావిడ తన కంచు కంఠంతో అరుస్తుండేది. ఇవి చాలవన్నట్టు ఆవిడ గారి అబ్బాయి ఆఫీసు నుంచి రాగానే ప్రేమనగర్‌లోని 'ఎవరికోసం' పాటను ఖూనీ (ప్రాక్టీసు) చేస్తుండేవాడు. ఇదంతా భరించి పడుకునేందుకు ప్రక్కలమీద్ధ వాలితే యింటి పై స్లాపు విరిగి పడిపోతుందేమో నన్నట్టుగా పిల్లలు చదువు మొదలుపెట్టేవాళ్ళు.

ఈలోగా ఆవిడ పనులన్నీ చక్కబెట్టుకొని వచ్చి "పక్కింటివాళ్ళు అప్పుడే పడుకున్నట్టున్నారే....?" అంటూ తలుపుతట్టి శ్రీమతిని పిల్చేది. శ్రీమతి పలక్కపోతే అమ్మను పిల్చేది. అమ్మ అసలే ఆస్మాతో బాధపడుతోంది. ఆ జబ్బు ఎప్పుడు నిద్ర పోనిస్తుందో— ఏ క్షణంలో దగ్గు ఆయాసంతో ఊపిరాడనివ్వకుండా చేస్తుందో తెలియదు. మీదపడుతున్న వయస్సు కావడంతో మందులు వాడుతున్నా వాటి ప్రభావం అంతంత మాత్రంగానే వస్తోంది. అమ్మను యిబ్బందిపెట్టడం దేనికని శ్రీమతి విసుక్కుంటూ వెళ్ళి కూర్చునేది.

"మా పెద్దల్లుడు కలకత్తాలో ఓ పెద్ద కంపెనీకి చీఫ్ యింజనీర్ ...." అని మొదలుపెట్టి అంతటి అదృష్టం ఆవిడల్లుళ్ళకే తప్ప మరొకరికి రానట్లు, కలకత్తా యిండియాలోకాక ఫారెన్ కంట్రీలో వున్నదేమో అన్న భ్రమ వినేవాళ్ళకు కలిగేటట్టు - యిలా ఆవిడకు నిద్రవచ్చే వరకూ ఏదో ఒకటి చెబుతూనే వుండేది.

ప్రక్క పోర్షను అద్దెకిచ్చామని. దాంట్లో వుంటున్నది మనుష్యులేనన్న యింగితం ఆవిడగానీ, పిల్లలకు గాని వున్నట్టు నాక్కనిపించలేదు. యిది మేము ఎప్పుడు చేసుకున్న పుణ్యమో తెలిసి చావలేదు. తిరిగి తిరిగి కావాలని తలనొప్పి తెచ్చుకున్నట్టయింది నాపని. యిలా ఎంత కాలం భరించాలి?

భరించలేని రోజొకటి అనుకోకుండా రానే వచ్చింది. ఇంటావిడ మనువడు వాళ్ళక్కమీ దెందుకో కోపం వచ్చి చేతిలోవున్న బంగినపల్లి మామిడికాయ బలంకొద్దీ విసిరాడు. అది తిన్నగా మా యింట్లోకి దూసుకొచ్చి, గదిలో వున్న నిలువుటద్దానికి తగిలి అద్దం భళ్ళున బద్దలైంది. ముచ్చటైన అద్దం ముక్కలవడంతో శ్రీమతి చూస్తూ వూరుకోలేక పోయింది. కుర్రాణ్ణి నాలుగుతిట్టి "మామ్మగారూ! పిల్లల్ని మరీ అంత అల్లరికి వదిలేస్తే ఎలా? కాస్తంత క్రమశిక్షణలో పెట్టండి. యిల్లు మీదైనా యింట్లో అద్దెకుండే వాళ్ళ వస్తువులు పోగొడుతుంటే ఎవరూరుకుంటారు? అల్లరి చేయడానికో హద్దూ- అపూ లేదా?" అంది ఆవేశంగా యిల్లుగలావిడతో.

ఆ మాటలకు ఆవిడ శ్రీమతి పైపు చూసిన చూపు నాకిప్పటికీ మరపురాదు. ఆవిడ చూపుల్లో ఏదైనా అతీతశక్తి వుండి వుంటే శ్రీమతి అక్కడే కాలి బూడిదై వుండేది. "నీకు నలుగురు పిల్లలు పుట్టిన తర్వాత చెబుదువుగానిలే అమ్మా ఈ మాటలు. అయినా వాళ్ళ బరువు మువ్వేం మోస్తున్నావు? నలుగురు పిల్లలున్న ఇల్లు అల్లరి లేకుండా వుంటుందా? ఆ మాట కొస్తే రాత్రిళ్ళు మీ అత్తగారు దగ్గేదగ్గుకు నిద్రపట్టక ఛస్తున్నాను- మీరంత భరించలేకపోతే వేరే యిల్లు చూసుకోండి."అందావిడ నిష్కర్షగా. మేము ఏంచేసినా మీరు భరించాలన్న నిర్లక్ష్యధోరణి ఆవిడ మాటల్లో స్పష్టమైంది.

నామీదనైతే రుసరుసలాడగల శ్రీమతి మారు మాట్లాడక ముఖం చిన్నబుచ్చుకొని గదిలోకి వచ్చేసింది. ఆ క్షణంలో యిల్లుగలావిడమీద నాకు చాలా కోపంవచ్చింది. ఆవిడ్నేమీ అనలేక నా కోపాన్ని శ్రీమతి మీద చూపించేశాను. "వాళ్ళు అల్లరిచేస్తే నీకెందుకు? అలోమని ఏడిస్తే నీకెందుకు?




నీ బాబు ఏమైనా కట్టించాడా ఈ యిల్లు.." యిలా వుద్రేకంగా అనేస్తూ ఆమె కళ్ళల్లో నీళ్ళు చూసి చప్పగా చల్లారిపోయాను.

ఆ రోజు ఎలాంటిదోకాని మా యింట్లో అనుకోని మార్పు లొచ్చాయి.

అకారణంగా నాకోపానికి గురైన శ్రీమతి నాతో మాట్లాడ్డం మానేసింది.

ఆ యింటావిడ రాత్రి శ్రీమతిని పిలవడం విరమించుకొంది.

అప్పటి వరకూ ఫర్వాలేదనుకుంటున్న అమ్మకు దగ్గు, ఆయాసం ఎక్కువైంది. అర్ధరాత్రి సమయంలో అర్జంటుగా డాక్టరు దగ్గరకు పరుగుపెట్టడం తప్పలేదు. ఆకాశంలో ముసురుకున్న మబ్బుల్ని చూస్తూ బయటకు రావడానికి సందేహిస్తున్న డాక్టర్ని యింటికి తీసుకొచ్చేసరికి నాకు దేవుడు కనిపించాడు.

డాక్టరు వస్తూనే అమ్మను పరీక్షించి రెండు యింజెక్షన్లు చేశాడు. "ఈ డిసీజ్ లక్షణమే యింత ....పైన వాతావరణం చూశావుగా- మబ్బులు ముసురుకున్నా, చల్లటి గాలులు వీచినా ఆయాసంతో వీళ్ళు వుక్కిరి బిక్కిరి అవుతారు. ఎందుకైనా మంచిది. ఈ రాత్రికి కాస్త జాగ్రత్తలో వుండండి" అంటూ సిరప్ ఏదో రాసిచ్చి వెళ్ళిపోయాడాయన. ఆ రాత్రి నేను నిద్ర పోకుండానే తెల్లవారిపోయింది.

కాలకృత్యాలు తీర్చుకొని ఆఫీసుకు పోయే ప్రయత్నంలో వుండగా యిల్లుగలావిడ కబురుపెట్టింది. మళ్ళీ ఏమొచ్చి పడిందా? అనుకుంటూ వెళ్ళాను.

"మమ్మల్ని యిబ్బందిపెట్టడం మీకు న్యాయంగా వుందా నాయనా!"అందావిడ. నేనా గుమ్మంలోకి అడుగుపెట్టీ పెట్టగానే ఆ యిబ్బందేమిటో అర్ధంకాక ఆశ్చర్యంతో నిలబడిపోయాను.

"చూడు నాయనా! పది మంది పిల్లలున్న యిల్లిది. రెండు రోజుల్లో పురిటికని పుట్టింటి కెళ్ళిన నా కోడలు వస్తుంది. నాలుగైదు రోజుల్లో నా మూడో కూతుర్ని పురిటికి తీసుకురావాలి. ఏదో ముగ్గురే వుంటారని అడగ్గానే యిల్లిచ్చాను. రేపో- మాపో అంటున్న రోగిష్టి మనిషిని తీసుకొచ్చి యింట్లో పెడతావనుకోలేదు. ఏ క్షణంలో ఏం జరుగుతుందో? ఆ జరిగిన క్షణం మంచిది కాకుంటే మేం పడేపాట్లు ఆ భగవంతుడికే తెలియాలి....అందుకని నువ్వే మీ అనుకోక నా యిల్లు ఖాళీ చెయ్యాలి. నా కెంతో వుపకారం చేసినవాడి వౌతావు."

ఒక్క సారిగా నిర్ఘాంతపోయాను.

మనిషి అయ్యాక జబ్బులు రాక మానవు. జబ్బుచేసిన ప్రతి మనిషి చచ్చిపోవాలని యెక్కడాలేదు. రాత్రి జరిగిన హడావుడికి అమ్మను అప్పుడే చంపేస్తుందీవిడ. అరవై సంవత్సరాల జీవితంలో అనేకానేక కష్టసుఖాలు కాచి వడపోసిన మనిషి— సాటి స్త్రీ గురించి అలా మాట్లాడుతుంటే ఏమనాలో నాకు తోచలేదు. వస్తున్న ఆవేశాన్ని అణచుకొని, "యిల్లు ఖాళీ చెయ్యడం యింతలో జరగ"దని ఖచ్చితంగా చెప్పాను.

"ఖాళీ చేయకపోతే కుదరదు. ఆ ముసలావిడకా జబ్బు ముదిరిపోయింది. ఏ గంటలో 'హరీ'మన్నా మీతోపాటు మేమూ వీధినపడాలి. ఆ మనిషినీ యింట్లో వుంచడానికి వీల్లేదు. మంచిగా మీరు ఖాళీ చేయకపోతే ఎలా చేయించాలో నాకు తెలుసు." అందావిడ కుండ బద్దలు కొట్టినట్టు.

డాక్టరుగారు చెప్పిన రాత్రి గడిచిపోయింది. అమ్మ స్వస్థతగా వున్నట్టే కనిపిస్తోంది— యింకా అమ్మ యింట్లోనే చనిపోతుందన్న అనుమానం దేనికో— ఈ పట్టుదల ఎందుకో నాకు అర్థంకాలేదు. ఆవిడకు జబ్బు చేయనట్టు. చావు రానట్టు భవిష్యత్తంతా తెలిసినట్లుగా మాట్లాడేస్తుంది. ఆవిడతో వాదనకు దిగడం వ్యర్థమనిపించింది. "మీ యిష్టం వచ్చింది చేసుకోండి!" అని విసురుగా బయటకు వచ్చేశాను.

* * *

ఆఫీసుకు వెళ్ళానేగాని మనస్సంతా ఆందోళనగా వుంది. అద్దె యింట్లో వుండటంలో యిన్ని చిక్కులున్నాయని ముందే తెలిసివుంటే అమ్మను యిక్కడకు తీసుకొచ్చి వుండేవాణ్ణి కాను. మా యిల్లు గలావిడ సిద్ధాంతం ప్రకారం అద్దెకుండే వాళ్ళకు అమ్మలు - అమ్మమ్మలు వుండకూడదు. జబ్బులు చెయ్యకూడదు. ఖాళీ చెయ్యాలని ఖచ్చితంగా ఆవిడతో చెప్పానే గాని యిక ఆ యింట్లో వుండటం కష్టమనే నిర్ణయించుకున్నాను. అయితే మరో యిల్లు దొరకడం నేను నిర్ణయం చేసుకొన్నంత సులభం మాత్రం కాదు. మొన్నటివరకూ యింటికోసం తిరిగిన కాళ్ళ నొప్పులు యింకా తగ్గనే లేదు - మళ్ళా యిప్పుడెక్కడని తిరగాలి?

నేనిలా ఆలోచనలతో సతమతమవుతుండగానే మూడు గంటలైంది. అర్జంటు ఫైలొకటి రావడంతో మనస్సు పనిలో కేంద్రీకరించి చకచక పని చేస్తుంటే "మీకు ఫోన్ వచ్చిందండీ!" అన్నాడు ఆఫీస్ బాయ్ వచ్చి.

"నాకు టెలిఫోనా!" సందిగ్ధంగా అతనివైపు చూశాను. ఫోన్ చేసేటంతటి పరిచయస్తులెవరూ కాకినాడలో లేకపోవడమే అందుకు కారణం.

"మీకేనండీ" అన్నాడతను మరోసారి. సీట్లోంచి లేచి ఫోన్ దగ్గరకు నడిచాను. రిసీవర్ అందుకొని "హలో! నిరంజనరావుని మాట్లాడుతున్నాను" అన్నాను.

"మీరేనా....నేను నీరజను. అర్జంటుగా వచ్చేయండి. ఆవిడ చనిపోయారు. నాకు అయోమయంగా వుంది. నిల్చున్నపళంగా మీ రొచ్చేయండి...." కంగారుగా వినిపించింది అటువైపునుంచి శ్రీమతి కంఠం.

రిసీవర్ యెక్కడుంచానో గుర్తులేదు. మేనేజర్ని పర్మిషను ఎలా అడిగానో నాకే తెలియదు. పైనుంచి క్రిందికి దూకేసినట్టు ఆఫీసులోంచి బయటకొచ్చేశాను. రిక్షాలో కూర్చొని వాడిశక్తి చూపించమన్నాను.

అయిపోయింది. నేను వూహించనిదీ. యిల్లు గలావిడ వూహించినదీ జరిగిపోయింది. అమ్మ యింట్లోనే ప్రాణం వొదిలివుంటే........ఆ క్షణాలు మంచివి కాకుంటే ఏం చెయ్యాలి? యిల్లు గలావిడ నన్ను నిలబడనిస్తుందా? అమ్మ చనిపోయిన బాధ మనస్సును తొలుస్తుంటే యిల్లు గలావిడ అనే మాటలు తల్చుకొని నా ఒళ్లు గగుర్పొడుస్తుంది.

యింటి సమీపంలోకి రిక్షా వచ్చేసింది. మా యింటి ముందు గుంపుగా జనం కనిపిస్తున్నారు. రిక్షా ఆపించి దిగిపోయాను. నా గుండె లదురుతున్నాయి. శరీరం ఒణుకుతోంది. అడుగులు తడబడుతున్నాయి. నేను రావడం ఎవ్వరు చూసిందో గుంపులోంచి శ్రీమతి గబగబా బయటకు వచ్చి "పాపం ఆవిడ చనిపోయారండి!" అంది కళ్ళు తుడుచుకుంటూ.

"ఆవిడంటే....?" అన్నాను అనుమానంగా శ్రీమతిని చూస్తూ.

"మన యిల్లు గలావిడండీ!" అంది శ్రీమతి.

నిశ్చేష్టుడనై నిలబడిపోయాను. కొన్ని క్షణాలు నాగుండె తన పని చేయడం మర్చిపోయిందేమో ననిపించింది.

"యిప్పటివరకూ యింట్లో కూర్చొని ఆ ఎదురింటావిడతో ఖంగున మాట్లాడుతూనే వుంది. అంతలోనే ఏమైందో ఎదురింటామె కంగారుగా పిలిస్తే నేనావిడ గదిలోకెళ్ళాను. అప్పటికే ఆవిడ ప్రాణం పోయింది. ఈ విషయం యింకా ఆవిడ కొడుక్కి- మిగతా పిల్లలకు తెలియదు" అంది మళ్ళా శ్రీమతి.

నా అయోమయ అవస్థనుంచి తేరుకొని గుంపులో జొరబడి ముందుకు చూశాను. యిల్లుగలావిడ తలదగ్గర కూర్చొని అమ్మ ఏడుస్తోంది. నాకు తెలియకుండానే నా కళ్ళల్లోంచి కన్నీళ్ళు జల జల క్రిందకు రాలాయి. భారమైన హృదయంతో పోస్టాఫీసుకు నడిచి యింటావిడ కొడుక్కి. పిల్లలు చదువుకుంటున్న స్కూలుకు ఫోన్ చేశాను.

అన్ని కార్యక్రమాలు ముగిసినతర్వాత అప్పల నరసయ్యగారి దగ్గరకెళ్ళి అడిగితే ఆయన పంచాంగం తెరిచి ఆర్నెల్లపాటు ఆ యింట్లో వుండకూడదన్నారు. ●

